ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

బుధవారం 4 డిసెంబరు 2024



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దళితబంధు నిధులు విడుదల చేయాలి

» బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

ఆమనగల్లు , డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన దళితబంధు యూనిట్లకు వెంటనే నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలో మంగళవారం వారు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మండల పరిషత్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్ మాట్లాడుతూ దళితుల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురావాలనే ఉద్ధేశంతో మాజీ సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధును నీరుగార్చి మంజూరైన యూనిట్లకు నిధులు కేటాయించకుండా లబ్ధిదారులను వేదనకు గురి చేస్తోందన్నారు. దళితబంధు యూనిట్లకు వెంటనే నిధులు విడుదల చేసి పథకాన్ని కొనసాగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని పత్యానాయక్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దళితులకు ఇచ్చిన హామీలను విస్మరించి నియంత పాలన సాగిస్తోందని, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు గుత్తి బాల స్వామి, వస్పుల సాయిలు, సురమల్ల సుభాష్, వడ్డెమోని శివకుమార్, లండం యాదయ్య, వస్పుల రంజిత్, కాలె విక్రమ్, దేవేందర్, మహేశ్, గణేశ్, యాదయ్య, భీంజీ నాయక్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పూదోట కాదు.. పుంటి సాగు

ఈ ఫొటోను చూస్తే ఎవరైనా విరబూసిన గులాబీ తోట అనుకుంటారు. కానీ ఇది పూదోట కాదు. ఆదిభట్ల మున్సిపాలిటీ రాందాస్‌పల్లి ఔటర్ సమీపంలో ఓ రైతు సాగు చేసిన ఎర్ర పుంటి(గోంగూర) తోట. ఏపుగా పెరిగిన పుంటి చెట్లకు ఎర్రటి బొడ్డెలు కాసి గులాబీ తోటను తలపిస్తోంది. ఈ ఆకు కూర తోట ఔటర్ సర్వీస్ రోడ్డులో వెళ్లే ప్రయాణికులను కనువిందు చేస్తోంది.

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నేడు

ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ఆమనగల్లు , డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీ లక్ష్మీగార్డెన్‌లో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలు హాజరు కానున్నారని, కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య తెలిపారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



రావిర్యాలలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఆరు గ్యారంటీలపై అవగాహన

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ఆట పాటలతో కళాజాత బృందం సభ్యులు మంగళవారం జిల్లాలో అవగాహన కల్పించారు. ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై రావిర్యాల, తుక్కుగూడ, ఇమామ్‌గూడ గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాల వద్ద కళారూపాలను ప్రదర్శించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్‌లో యాదయ్య కళాబృందం ప్రదర్శన నిర్వహించారు. కొందుర్గు, పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో మల్లంపల్లి రాజు కళా బృందంచే ప్రదర్శన నిర్వహించారు.

వెసెక్టమికి వెనకడుగు!

మూడేళ్లలో కేవలం 44 ఆపరేషన్లే

జిల్లాలో కుటుంబ నియంత్రణ (కు.ని) ఆపరేషన్లు చేయించుకోవడంలో పురుషులు వెనకడుగు వేస్తున్నారు. ఈ ఆపరేషన్ చేసుకోవడం మహిళ బాధ్యత.. మాకెందుకు ఈ తలనొప్పి అనుకొని చాలామంది వెసెక్టమి చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. ఈ ఆపరేషన్ చేయించుకుంటే బలహీనపడిపోతామనే అపోహలు కూడా చాలామందిలో ఉన్నాయి. ప్రజల్లో అవగాహన కల్పించి వెసక్టమి ఆపరేషన్ల సంఖ్య పెంచాల్సిన వైద్యశాఖ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. వెసక్టమి శస్త్రచికిత్సల పక్షోత్సవాల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

గ్రామాల్లో కొరవడిన ప్రచారం

చేవెళ్ల, షాద్‌నగర్ క్యాంపులు వెలవెల

పట్టించుకోని వైద్య శాఖ అధికారులు



చేవెళ్ల ఆసుపత్రి వద్ద కట్టిన బ్యానర్



కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	డీపీఎల్	ప్రభుత్వ	ప్రైవేట్	మొత్తం	వెసక్టమీ
2022-23 (ఏప్రిల్-మార్చి)	1933	663	7,233	7,896	17
2023-24 (ఏప్రిల్-మార్చి)	0	659	6,094	6,753	21
2024-24 (ఇప్పటి వరకు)	0	341	1,880	2,221	06
మొత్తం	1,933	1,663	15,207	16,870	44

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవడంలో మహిళలకంటే పురుషులు చాలా వెనకబడి ఉన్నారు. పిల్లలు పుట్టకుండా మహిళలకు ట్యుబెక్టమి, పురుషులకు వెసెక్టమి ఆపరేషన్ చేస్తారు. ఇందులో ట్యుబెక్టమి ఆపరేషన్‌లే అధికంగా జరుగుతున్నాయి. జిల్లాలో 27 మండలాలు, 16 మున్సిపాలిటీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 70 బస్తీ దవాఖానాలు, 122 పల్లె దవాఖానాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా 52,96,741 ఉండగా.. 2024 అంచనా ప్రకారం 84.53 లక్షల మంది ఉన్నారు. కుటుంబ నియంత్రణ

మిగతా 8వ పేజీలో...

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఆమనగల్లు విద్యార్థి



సునీల్‌ను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి సునీల్ రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికయ్యాడు. శంషాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాల ఎంపికైంది. జిల్లాస్థాయి ఎగ్జిబిషన్‌లో సునీల్ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో సునీల్‌ను ఎంఈవో పాండు ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయుడు శ్రీధర్ సునీల్‌కు రూ.500 ప్రోత్సాహకాన్ని అందజేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

మహేశ్వరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సూచించారు. మంగళవారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేసిన, చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లోని ప్రజలకు వివరించాలన్నారు.

కొందుర్గుకు మహర్దశ

మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఇంటిగ్రేటెడ్ స్కూల్, మినీ స్టేడియం కోసం టెండర్లు
- రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రైల్వే ఏరియల్ సర్వే
- త్వరలో ఉమ్మడి మండలంలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటుకు చర్యలు
- ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణతో మారనున్న రూపురేఖలు



రేగడి చిల్కమర్రిలో త్రిబుల్‌ఆర్ కోసం వేసిన గుర్తులు (ఫైల్)



రేగడి చిల్కమర్రి శివారులో ఇటీవల చేసిన ఏరియల్ సర్వే

చౌదరిగూడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కొందుర్గు మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో మండలానికి మహర్దశ పట్టనుంది. మండలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మినీ స్టేడియం, రీజినల్ రింగ్‌రోడ్డు, ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణ పనులు, నూతన మార్కెట్ యార్డు ఏర్పాటుకు సర్కారు ముందుకు వచ్చింది. ఇప్పటికే కొందుర్గు మండలంలో ఇంటర్‌నేషనల్ స్థాయిలో సమీకృత గురుకుల సముదాయ భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇంటిగ్రేటెడ్, మినీస్టేడియం పనులకు టెండర్లు నోటిఫికేషన్ వేశారు. దీంతో పాటు నిత్యం కొందుర్గు రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో షాద్‌నగర్ నుంచి పరిగికి నాలుగు లేన్ రోడ్డు నిర్మాణం కోసం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతిపాదనలు పంపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని స్థానికులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డు సైతం కొందుర్గు మండలం నుంచి వెళ్లనుంది. దీనికి ఇప్పటికే అధికారులు మార్కింగ్ వేశారు. దీనికి తోడు రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైల్వే నిర్మాణం కోసం ఆర్వీ అసోసియేషన్ ప్రతినిధులు హెలికాప్టర్ సహాయంతో ఇటీవల ఏరియల్ సర్వే చేశారు. త్వరలో ఉమ్మడి కొందుర్గు మండలంలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటు రంగం సిద్ధం కాబోతుంది. దీంతో కొందుర్గు మండల రూపురేఖలు మారనున్నాయి.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో విద్య, వైద్యం, గ్రామాలకు రోడ్లు బాగుంటేనే ఆయా గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఉమ్మడి కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, మినీస్టేడియం, నూతన మార్కెట్ యార్డు ఏర్పాటుతో పాటు జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకొని త్వరగా నిర్మాణ పనులు చేసేందుకు చొరవ తీసుకుంటున్నాం.

- వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్

చేపట్టనున్న అభివృద్ధి పనులు

కేంద్రప్రభుత్వ నిధులతో రూ. 50 కోట్లతో చేపట్టనున్న క్రీడా మైదానం కోసం కొందుర్గు శివారులో పడమరలో పదెకరాల స్థలంలో మినీ స్టేడియం, రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాల్లో రూ.150 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయనుంది.. ఈ పనుల కోసం ఇప్పటికే టెండర్లను పిలిచినట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఉమ్మడి కొందుర్గు మండలంలో మార్కెట్ ఆర్డు, కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేస్తామని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారు. దీంతో మండలం పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధిస్తుందన్న ఆశలో మండల ప్రజలు ఉన్నారు.



లింక్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

అధ్వానంగా ఎలికట్ట-రామేశ్వరం రోడ్డు

పదేళ్లుగా మరమ్మతులకు నోచని మట్టి రోడ్డు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు..

వాహనదారుల ఇబ్బందులు

8



మృతదేహాలకు అంత్యక్రియలు

గ్రామంలో పోలీసుల బందోబస్తు

ఆలూరు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ

7



చేవెళ్ల వద్ద బీజాపూర్ హైవేపై ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

రోడ్డు విస్తరణ చేపట్టాల్సిందే

చేవెళ్లలో అఖిలపక్ష నాయకుల మహాధర్నా

హైదరాబాద్ - బీజాపూర్ హైవే రోడ్డును విస్తరించాలని డిమాండ్

పాదయాత్ర చేస్తున్న నేతల అడ్డగింత.. భారీగా మోహరించిన పోలీసులు

ఏడాదిలోగా పనులు ప్రారంభిస్తామన్న ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి

చేవెళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరు వద్ద బీజాపూర్ రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటున్న వారిపైకి లారీ దూసుకెళ్లడంతో నలుగురు రైతులు మరణించారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆగ్రహించిన అఖిలపక్ష నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. చేవెళ్ల వద్ద హైదరాబాద్-బీజాపూర్ రోడ్డుపై రెండు గంటలకు పైగా ధర్నా చేశారు. అంతకుముందు ఆలూర్ గేట్ నుంచి చేవెళ్ల వరకు పాదయాత్రగా వస్తున్న నాయకులు, రైతులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో చాలామంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. మృతుల కుటుంబాలకు భారీగా పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి

మిగతా 8వ పేజీలో...

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

మహేశ్వరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజా విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. మంగళవారం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడానికే ప్రజా విజయోత్సవాలు జరుపుకుంటున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 66 అబద్దాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న సీఎం మోసాలను పక్కకు పెట్టి హామీల అమలుకు ప్రయత్నం చేయాలన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి కూడా కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. నాయకులు పాపయ్యగౌడ్, అనంతయ్యగౌడ్, కడారి జంగయ్య యాదవ్, సుదర్శన్‌రెడ్డి, యాదయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, రచ్చలక్ష్మణ్, రాధాధీరజ్ రెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలతారాజు పాల్గొన్నారు.

ఆరుబయట విద్యార్థినుల స్నానం

ఉపాధ్యాయులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

దౌల్తాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలంపేట కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు ఆరుబయట స్నానం చేయడంపై తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంతో ప్రిన్సిపాల్ జ్యోతి, ఎంఈవో వెంకటస్వామిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మిషన్ భగీరథ తాగునీటిని అందించాలని ఆదేశించారు. అనంతరం బాలంపేట, దౌల్తాబాద్‌లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వడ్లు అమ్మి చాలా రోజులైనా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకాలేదని రైతులు సబ్‌కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో అధికారులను ఆయన ప్రశ్నించారు. రైతుల డబ్బు వెంటనే జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గోకఫస్లాబాద్‌లో జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ గాయత్రి, రాజేందర్‌రెడ్డి, ప్రమోద్ రావు, వీరన్న ఉన్నారు.


విద్యార్థినులు ఆరుబయట స్నానం చేసే చోటును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

శంషాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఆటో ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం ఆటో ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు ఆయన్ను నగరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు ఎండీ హబీబ్, బీఎంఎస్ రవి, ఎస్టీఏడీయూ పల్లె రవి, భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్, తెలంగాణ ఆటో అండ్ టాక్సీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నందకిషోర్ టీఆర్‌టీ, ఏకేటీయూ సభ్యులు కలసి వినతిపత్రం ఇచ్చారు. సభ్యులు మాట్లాడుతూ 9 నెలల క్రితం ఆటో డ్రైవర్లతో చర్చలు జరిపి.. వారికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. తెలంగాణలో డ్రైవర్లు ఉపాధి లేక కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఆటో, రవాణా కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తామని, ఏటా రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వం ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి సర్వీసులకు అనుమతి ఇచ్చారని, ప్రభుత్వం వాటిని రద్దు చేయాలన్నారు. ఈ మేరకు మంత్రి పొన్నం స్పందించి చర్చలు జరపడం ఆలస్యమైందని, ఆటోలు బంద్ చేయడం సరికాదన్నారు. త్వరలోనే ఆటో, ప్రైవేటు రవాణా సంఘాలతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు.

కాగా, కొన్ని సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 7న జరుపతల పెట్టిన ఆటో బంద్‌ను ఐకాసా వ్యతిరేకిస్తుందని సభ్యులు తెలిపారు. ఆటో బంద్ అనేది డ్రైవర్లకు సరికాదని, మంత్రి హామీ ఇచ్చిన నేపథ్యంలో తాము బంద్‌ను వ్యతిరేకిస్తున్నామని ఐకాస డ్రైవర్లు బంద్‌లో పాల్గొనరని తెలిపారు.


మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

బీఆర్ఎస్ నాయకులవి కుట్ర రాజకీయాలు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అధికారానికి దూరమయ్యామన్న అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజారంజక పాలనను చూసి జీర్ణించుకోలేని విపక్షాలు విషం కక్కుతున్నాయని అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో 25 ఎకరాలలో రూ.125 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని ఆరులేన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, రహదారుల మరమ్మతులకు రూ.91 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, మార్కెట్ చైర్మన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు బాధితులకు మంజూరైన రూ.2.62 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమనగల్లులో ఎమ్మెల్యే పంపిణీ చేశారు.


చిన్నారులతో హెచ్‌బీఎల్ సీఎస్ఆర్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నాం

శామీర్‌పేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులు అనారోగ్యంతో బాధపడకుండ ఉండేందుకు తమ హెచ్‌బీఎల్ తరఫున నిత్యం అరటిపండ్లు, పాలు, మిల్లెట్లతో కూడిన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని కంపెనీ సీఎస్ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం తూంకుంట కమ్యూనిటీ హాల్‌లో హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ కంపెనీ భగీరథ బాలల వికాస కేంద్ర వార్షికోత్సవాన్ని అంగన్‌వాడీ పిల్లలు, టీచర్లతో కలసి నిర్వహించారు. సీఎస్ఆర్ అధికారులు చిన్నారులకు సాంస్కృతిక కార్యాక్రమాలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కోఆర్డినేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమ హెచ్‌బీఎల్ మండలంలోని 17అంగన్‌వాడీ సెంటర్లను దత్తత తీసుకొని రోజూ పౌష్టికాహారాన్ని అందిస్తోందని చెప్పారు. ఏడాదిలో మూడు జతల యూనిఫారాలను, బర్త్ డే కానుకలను, పిల్లలకు అవసరమైన వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌బీఎల్ జనరల్ మేనేజర్ అనూష్, ప్రొడక్షన్ ఆపరేషన్స్ హెడ్స్ సుధాకర్, ముఖేష్‌గుప్తా, ఫైనాన్స్ హెడ్స్ రామక్రిష్ణ, మంజుల, ఐసీడీఎస్ సీడీపీవో శారద, సూపర్‌వైజర్, టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

యాచారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణకు ప్రతీ వ్యక్తి బాధ్యతగా భావించి చొరవ తీసుకోవాలని, రాబోయే ఎండాకాలంలో అడవులు అగ్నికి ఆహుతి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం డివిజన్ అటవీశాఖ రేంజర్ శ్రీనివాస్ రెడ్డి కోరారు. అడవుల సంరక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం గున్‌గల్ నర్సరీలో యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండాకాలంలో సిగరెట్, బీడీ కాల్చి అడవీ ప్రాంతంలో పారేస్తే అగ్ని ప్రమాదం సంభవించి విలువైన చెట్లు కాలిపోతాయని, అలా కాకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరు చొరవ తీసుకోవాలన్నారు. అధికారులతో పాటు ఉద్యోగులు ఇందుకు ముందుకు రావాలన్నారు. అడవిలో మంటలు లేచినట్లు గమనిస్తే వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించాలని సూచించారు. అడవులను కాపాడుకుంటే ఎంతో విలువైన వన్యప్రాణులను కాపాడుకోవడం చాలా సులువన్నారు. 1980 వరకు అడవిలో తోడేళ్లు ఉండేవని.. నేడు పూర్తిగా కనుమరుగైనట్లు చెప్పారు. దట్టమైన అడవి ఉంటే నేడవి ఉండేవన్నారు. కుందేళ్ల, అ డవిపందుల వేట నిషేదమన్నారు. గున్‌గల్ రిజర్వ్‌ఫారెస్టులో నేటికి జింకలున్నాయని రహదారి వెంట వాహనాల్లో వెళ్లేవారు జింకలను ప్రమాదాలకు గురి చేయకూడదని కోరారు.పంచాయతీ కార్యదర్శులు అడవుల సంరక్షణ కోసం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. మొక్కల సంరక్షణ బాధ్యత మనమందరిపై ఉందనే విషయం గమనించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రేంజర్ స్వప్న, యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, అటవీశాఖ సెక్షన్ అధికారి నర్సింహ తదితరులున్నారు.


మాట్లాడుతున్న రేంజర్ శ్రీనివాస్‌రెడ్డి

వేధించాడని ఫిర్యాదు చేస్తే కళాశాల నుంచి సస్పెండ్

భారత్ బైబిల్ కళాశాల అనాథ విద్యార్థి బ్లెస్సీ ఆవేదన

మేడ్చల్ టౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): భారత్ బైబిల్ కళాశాల రిజిస్ట్రార్ డైరెక్టర్లు మానసికంగా, శారీరకంగా వేధించారంటూ భారత్ బైబిల్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే కాలేజీ యాజమాన్యం తనను కళాశాల నుంచి తొలగించి కేసు పెట్టారంటూ మొరపెట్టుకుంది. తనకు జరిగిన అన్యాయం పట్ల బాధిత విద్యార్థిని మంగళవారం డబిల్‌పూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. విజయవాడకు చెందిన బ్లెస్సీ సందక(20) మేడ్చల్ మండలం డబిల్‌పూర్ శివార్లలోని భారత్ బైబిల్ కళాశాలలో బ్యాచ్‌లర్ ఆఫ్ థియాలజీ చదువుతోంది. కొద్ది రోజులుగా రిజిస్ట్రార్ వినయ్ కుమార్ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. అతడి వేధింపులపై విద్యార్థిని కళాశాల డైరెక్టర్ భోజిరెడ్డికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. అనంతరం రిజిస్ట్రార్, డైరెక్టర్ ఇద్దరూ కలిసి విద్యార్థినిని వేధించారు. దీంతో ఆమె నవంబరు 1న మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. కాగా కేసు ఉపసంహరించుకోవాలని రిజిస్ట్రార్, డైరెక్టర్లు ఒత్తిడి తేగా బాధితురాలు ఒప్పుకోలేదు. దీంతో విద్యార్థులకు, కళాశాలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించిందంటూ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో బ్లెస్సీ, ఆమెతో పాటు అక్షయ్ అనే యువకుడిపై కాలేజీ నిర్వాహకులు ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేశారు. విషయాన్ని బయట పొక్కకుండా యాజమాన్యం తనపై ఒత్తిడి తీసుకొచ్చినప్పటికీ తాను వినకపోవటంతో మరిన్ని చిత్రహింసలు పెడుతున్నారని విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంకా మూడు నెలల్లో తన ఫైనల్ ఇయర్ పూర్తి కానున్నదని, ఇలాంటి పరిస్థితుల్లో తనను కళాశాల నుంచి సస్పెండ్ చేయటం అన్యాయం అని బాధితురాలు వాపోయింది. రిజిస్ట్రార్, డైరెక్టర్ల వేధింపుల తాళ లేక ప్రతిఘటించిన పాపాన తన జీవితాన్ని నాశనం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేసింది.


భారత్ బైబిల్ కళాశాల బాధితురాలు బ్లెస్సీ సందక

విచారణ జరుపుతున్నాం : సీఐ సత్యనారాయణ

భారత్ బైబిల్ కళాశాల విద్యార్థిని బ్లెస్సీ ఇచ్చిన ఫిర్యాదుపై నవంబరు 1న కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు. బ్లెస్సీ. అక్షయ్ అనే యువకుడితో కలిసి కాలేజీలో తరగతులు నిర్వహించకుండా అడ్డుకోవటంతో యాజమాన్యం ఆమెపై ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు విచారణ జరిపేందుకు ప్రత్యేకంగా మహిళా ఎస్సైని నియమించినట్లు చెప్పారు. యాజమాన్యంతో పాటు, విద్యార్థుల వాంగ్మూలాలను సేకరిస్తున్నామని సీఐ సత్యనారాయణ వివరించారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు సన్మానం



హోంగార్డును సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు తాము ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, ఏదైనా అవసరం ఏర్పడితే సంప్రదించాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగ విమరణ పొందిన హోంగార్డు సత్తయ్యను సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డు అధికారులు పోలీస్‌శాఖకు అందించే సేవలు విలువైనవని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ డేవిడ్, జిల్లా హోంగార్డ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్, రాష్ట్ర హోంగార్డు ఆర్గనైజేషన్ సెక్రటరీ చాంద్ పాషా, హోంగార్డులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న భీమ్‌రెడ్డి

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం జాతీయ హోదా కల్పించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కులకచర్లలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి కావడం లేదన్నారు. జాతీయ హోదా కల్పించి పూర్తిచేయాలన్నారు. మహబూబ్‌నగర్, చేవెళ్ల ఎంపీలు డీకే.అరుణ, విశ్వేశ్వర్‌రెడ్డిలు నిధులు మంజూరు చేయించాలన్నారు. రైతు రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. త్వరలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు వెంకటయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందని పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి తెలిపారు. మంగళవారం చౌడాపూర్ మండలం మెడినడంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చౌడాపూర్‌లో ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఆమె వెంట ఏవో పరిమళ, ఏఈవో విశ్వనాథ్ ఉన్నారు.

గ్రామాల నుంచే ప్లాస్టిక్ నిషేధం కొనసాగాలి



కులకచర్ల వివేకానంద కళాశాలలో మాట్లాడుతున్న ప్రహ్లాద్‌రావు

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల నుంచే ప్లాస్టిక్ నిషేధం కొనసాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. మంగళవారం వివేకానంద జూనియర్ కళాశాల, కరణం పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులకు వీఎస్ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో అనర్థాలు కలుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థి దశ నుంచే ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజిలయ్య, కళాశాల సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు సాయిభరత్‌కుమార్, ఉత్తమ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారి విస్తరణను 120ఫీట్లకు తగ్గించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శామీర్‌పేట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టనున్న రాజీవ్‌రహదారి విస్తరణను 200ఫీట్లకు కాకుండా 80ఫీట్లకు తగ్గించి 120ఫీట్ల మేర మాత్రమే స్థలాలను సేకరించాలని రోడ్డు విస్తరణలో ఇళ్లు, షాపుల కోల్పోనున్న నిర్వాసితులు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. రాజీవ్‌రహదారి నిర్వాసితులు మంగళవారం తూంకుంటలో జిల్లా బీజేపీ నాయకుడు, తూంకుంట మెయిన్ రోడ్డు బిల్డింగ్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కాసుల సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో రాజీవ్‌రహదారిపై ర్యాలీగా తిరిగి ఆందోళన చేశారు. తూంకుంటలో షాపులను మూసి ఆందోళన చేస్తున్న బాధితుల వద్దకు జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్ వచ్చి మాట్లాడారు. తూంకుంట వద్ద హైవే విస్తరణలో మీ సమస్యలేమిటని నిర్వాసితులతో మాట్లాడి అభ్యంతరాలను స్వీకరించారు. కార్యక్రమంలో తూంకుంట వెల్ఫేర్ సొసైటీ నాయకులు రాజులుగౌడ్, విద్యాసాగర్, సోనామ్, మల్లేశ్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, ఆంజనేయులు, నాగేందర్, మధు, శ్రీనివాస్‌గౌడ్, బాధితులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాస్‌తో చిన్నారులకు ఎంతో ఉపయోగం

న్యూయార్క్ డీసీ దిలీప్‌కుమార్ చౌహాన్



ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) :నల్లమల్లారెడ్డి రూపొందించిన అక్షరాభ్యాస్ పలకలు చిన్నారులకు ఎంతో ఉపయోగం పడుతాయని న్యూయార్క్ డీసీ దిలీప్ కుమార్ చౌహాన్ తెలిపారు. న్యూయార్క్‌లోని డీసీ (డిప్యూటీ కమిషనర్) కార్యాలయంలో ఆయన నల్లమల్లారెడ్డి రూపొందించిన అక్షరాభ్యాస్ పలకలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరభ్యాస్ పలకలు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, చిన్నారుల చదువులకు పునాది వస్తుందని తెలిపారు. న్యూయార్క్‌కు వచ్చే విద్యార్థు లకు అన్ని మౌళికసదుపాయాలతో పాటు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ నల్ల మల్లారెడ్డి, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్ల తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాత టెలికాం ఆఫీసు



శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- రికార్డులకు భద్రత కరువు
- ఇబ్బందుల్లో ప్రజలు, కార్యాలయాల సిబ్బంది

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నాయి. అధికారులు మారుతున్నారు. కానీ సర్కారు కార్యాలయాల దయనీయ దుస్థితి మాత్రం మారడం లేదు. నిజాం జమానాలో తాలూకా తహసీల్దార్ల కోసం నిర్మించిన పాత భవనాలు నేటికీ సేవలందిస్తున్నాయి. మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని భవనాలు శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం గత్యంతరం లేని పరిస్థితుల్లో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్ తమ విధులు నిర్వహిస్తున్నారు. పూర్వం ఈ ప్రాంగణంలో తాలూకా కార్యాలయాల ఏర్పాటుకు అవసరపడేలా భవనాలు నిర్మించారు. తపాల, టెలికాం, ఆబ్కారీ, సాంఘిక సంక్షేమ, పశుసంవర్ధక కార్యాలయాలు ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని భవనాల్లో ఉండేవి. కాగా వీటిలో కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరడంతో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్ఓల కార్యాలయాలు మినహా మిగితా కార్యాలయాలను వేరే చోటుకు తరలించారు.



శిథిలావస్థలో మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయం

దశాబ్దాలుగా అదే పురాతన కార్యాలయం

కీలక రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భూముల రికార్డులకు భద్రత కరువైందని వాపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం రెవెన్యూ కార్యాలయానికి వచ్చే మండల ప్రజలు కార్యాలయ దుస్థితి చూసి ఆశ్చర్యపోతున్నారు. ఎన్ని సంవత్సరాలైనా కార్యాలయ దుస్థితి మారకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు విడుదలైనా అధికారుల నిర్లక్ష్యంతో అది అటకెక్కింది. అధికారులు కార్యాలయంను అద్దె భవనంలోకి మార్చి ఇదే స్థలంలో నూతన కార్యాలయంను నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. అద్దె భవనం కోసం కూడా వెతికారు. కానీ చివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఇదే అదనుగా కొందరు రెవెన్యూపై పట్టు ఉన్న ప్రైవేట్ వ్యక్తులు తాత్కాలిక సిబ్బంది సహకారంతో రికార్డులను కూడా తారుమారు చేసే ఆస్కారం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. అధికారులు శిథిలావస్థకు చేరిన కార్యాలయాల్లో వసతుల్లేక విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఉన్నతాధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుత తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్ కార్యాలయాలకు రక్షణ లేని పరిస్థితి నెలకొంది. గత వర్షాకాలంలో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తడిసి ముద్దయ్యాయి. గతంలో కార్యాలయంలో ఉన్న టీవీని సైతం ఎత్తుకపోయేందుకు యత్నించారు. ఈ పాడుబడ్డ భవనాలను అధికారులు వదలడం లేదు. వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ ఆఫీసు ఆవరణలో నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ కార్యక్రమాల్లో దూసుకుపోతున్న ప్రభుత్వం

మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజావసరాల మేరకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దూసుకు పోతున్నదని మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్‌లోని తుమ్మ చెరువు-వివేకానంద చౌరస్తా వరకు నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, ఐదో వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వ నెరవేర్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తోందన్నారు. రానున్న కాలంలో మరిన్ని ప్రాజెక్టులు తెస్తామన్నారు. మేడ్చల్ అభివృద్ధికి దృష్టి సారించామన్నారు. నియోజకవర్గం పెద్దగా ఉన్నందున ఈ ప్రాంతం అభివృద్ధికి భారీగా నిధులవసరం అన్నారు. ప్రజాప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు దేవరాజ్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, నాయకులు ఎం.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో జరిగిన పలు కార్యక్రమాల్లో చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. సర్కారు గ్యారెంటీల అమలుకు చర్యలు తీసుకుంటోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేశామన్నారు. సంక్షేమ పథకాలు అందని అర్హులెవరైనా ఉంటే మున్సిపల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలందిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్మికులకు పీపీఈ కిట్లు అందజేశారు. సిబ్బందికి నిర్వహించిన వైద్య శిబిరంలో వివరాలడిగి తెలుసుకున్నారు. వారికి భోజనం వడ్డించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఆలూరు ఘటనలో మృతదేహాలకు అంత్యక్రియలు

మృతుల కుటుంబాలను పరామర్శించిన నాయకులు



ఆలూరులో కృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చేవెళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలూర్ గ్రామం గేట్ వద్ద కూరగాయలు అమ్ముతున్న రైతులపైకి లారీ దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందగా మరో నలుగురు గాయలపాలైన విషయం తెలిసిందే. ఈమేరకు మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చి మృతిచెందిన జామీల్ మృతదేహాన్ని పోలీస్‌లు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం మిగతా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. ఆలూర్, నాన్‌చెరి గ్రామాల్లో మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. దాంతో ఆ రెండు గ్రామాల్లో బంధువులు, కుటుంబ సభ్యుల రోదన అందరినీ కంటతడి పెట్టించాయి. రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులందరూ పనులకు వెళ్లకుండా ఊళ్లోనే ఉండిపోయారు. మృతుల కుటుంబ సభ్యులను చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పలువురు బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలతో పాటు బస్‌స్టేజీల వద్ద పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నివారించి మృతుల కుటుంబకు పరిహారం అందించాలని కోరుతూ సోషలిస్టు పార్టీ నాయకులు నీరటి ఆంజనేయులు, సుప్పల నర్సింలు, జంగయ్యల ఆధ్వర్యంలో చేవెళ్ల ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందించారు. కాగా, ప్రమాదం జరిగిన స్థలంలో ఎవ్వరూ కూరగాయలు అమ్మవద్దని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ప్రమాద స్థలం జనం లేకుండా వెలవెలబోయింది. ఆలూరు గేట్ నుంచి చేవెళ్ల వరకు ఎక్కడ చూసిన పోలీస్‌ల పహారా కన్పించింది.



కూరగాయలు అమ్మవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఏఎంసీ అధికారులు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో గాయలపాలైన మహిళా రైతులు బాలమణికి కాలు విరిగింది. మరో మహిళా రైతు ఆకుల పద్మమ్మకు తలకు గాయమైంది. మరో వ్యక్తి మల్యాద్రి చెయ్యి విరిగింది. వీరంతా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ అమీర్ నగరంలోని ఉస్మానియాలో చికిత్స పొందుతున్నాడు. అతడి రెండు కాళ్లు విరిగాయి. వీరందరి పరిస్థితి నిలకగానే ఉందని పోలీస్‌లు తెలిపారు.

చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు లారీ తరలింపు

ఆలూరు గేట్ వద్ద రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ నగరంలోని చంద్రాయణగుట్టకు చెందినదిగా గుర్తించారు. అయితే, ప్రమాద స్థలం వద్ద లారీ ఉంటే కోపంతో ఎవరైనా దానికి నిప్పు పెట్టే ప్రమాదం ఉందని చేవెళ్ల పోలీస్‌లు రాత్రికి రాత్రే ప్రత్యేకంగా రెండు క్రేన్‌ల సాయంతో శంకర్‌పల్లి నుంచి తెప్పించి మంగళవారం తెల్లవారుజాము వరకు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం చూసిన వారందరూ అక్కడ ప్రమాదానికి కారణమైన లారీ ఏమైందని చర్చించుకోవడం కన్పించింది.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్

విధినిర్వహణలో అలసత్వం తగదు

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అలసత్వం తగదని శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ అన్నారు. ఆమనగల్లు పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్‌లతో సమావేశమై పెండింగ్ కేసుల వివరాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు, చోరీల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలను అన్ని చోట్ల ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఏఎస్ఐ బాల్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ కోర్సులో అడ్మిషన్లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్



రామాచారి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్

వికారాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో డీఈఈ సెట్ 2024-26 రెండేళ్ల కోర్సులో అడ్మిషన్లకు రెండో విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 5న చేపడుతామని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామాచారి మంగళవారం తెలిపారు. 7 నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. 13న సీట్లు కేటాయిస్తారని, 13 నుంచి 17 వరకు ఫీజు చెల్లించి అలాట్మెంట్ లెటర్‌తో ఆయా కాలేజీలో సర్టిఫికెట్లు చూపి అడ్మిషన్ పొందాలని తెలిపారు. అలాగే కాలేజీ బదిలీ(మైగ్రేషన్) కొరకు 7 నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

'జూట్ బ్యాగ్స్' శిక్షణను వినియోగించుకోవాలి

శంషాబాద్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వర్ణ భారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే జూట్ బ్యాగ్స్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు ప్రతినిధులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణభారత్ ట్రస్టులో ఉచిత శిక్షణ ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతుందని, కాల పరిమితి 13రోజులు, సమయం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30గంటలు ఉంటుందని, వయస్సు 19-45 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. భోజనం, వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. రేషన్‌కార్డు తప్పనిసరి అని, ఆధార్‌కార్డు, 3ఫోటోలు అందించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9391487797, 9177141712, 9618534720, 6301890681, 9441728468 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి



చెంగోల్ జడ్పీ పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న డీఈవో రేణుకాదేవి

తాండూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనాన్ని అందించాలని వికారాబాద్ డీఈవో రేణుకాదేవి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం చెంగోల్ లోని జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం 4నుంచి 5గంటల వరకు కొనసాగుతున్న స్పెషల్ క్లాసులను పరిశీలించారు. ఎస్ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా హెచ్ఎం, టీచర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంట చేసే ముందు బియ్యం, కూరగాయలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

డైట్ విద్యార్థులకు అవగాహన

నేడు(బుధవారం) తాండూరు మండలంలోని 33పాఠశాలల్లో నిర్వహించే నాస్ ఎగ్జామ్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే.. సామర్థ్య పరిశీలన పరీక్ష)పై డైట్ విద్యార్థులకు డీఈవో అవగాహన కల్పించారు. సిరిగిరిపేట్ పరిధి అల్మాస్‌పేట్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో డైట్ విద్యార్థులకు సర్వేపై పలు సూచనలు చేశారు. 3,6,9వ తరగతులకు ఆలిండియా నేషనల్ అచీవ్‌మెంట్ కార్యక్రమంపై జాతీయ సామర్థ్య పరిశీలన పరీక్ష నిర్వహిస్తున్నందును విద్యార్థులు పరీక్షల్లో ఎలా రాణించాలన్న దానిపై వివరించారు.

రాజీమార్గమే రాజమార్గం



మాట్లాడుతున్న న్యాయాధికారి కాటం స్వరూప

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి కాటం స్వరూప అన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఆమనగల్లు కోర్టు ఆవరణలో మంగళవారం ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ నేపథ్యంలో పోలీస్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ప్రథమశ్రేణి న్యాయాధికారి కాటం స్వరూప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. పెండింగ్ కేసుల వివరాలు న్యాయాధికారి అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు తెలిపి సద్వినియోగం చేసుకునేలాచూడాలని సూచించారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం డబ్బు వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ పడి కేసుల నుంచి విముక్తి పొందాలన్నారు. ఏపీపీ కార్తిక్, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల్ సీఐ శివప్రసాద్, ఎస్సైలు వెంకటేష్, శ్రీకాంత్, వర్షప్రసాద్, ఎక్సైజ్ సీఐ బైద్యనాథ్ చౌహాన్‌లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బాలకృష్ణారెడ్డి



మొయినాబాద్ రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బొక్క బాలకృష్ణారెడ్డి నియమితులయ్యారు. కమిటీ కూర్పులో భాగంగా ఆయనను అదిష్టానం నియమించింది. మండలంలోని కనకమామిడికి చెందిన బాలకృష్ణారెడ్డి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారు. దాంతో ఆయనకు ఈ పదవి వరించింది. పలువురు బాలకృష్ణారెడ్డిని అభినందించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

కేశంపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర కీలకమని, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి తెలిపారు. మంగళవారం కేశంపేట పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ సందర్శించారు. సీఐ నరహరి ఏసీపీకి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, ట్రైనీ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

లింక్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- అధ్వానంగా ఎలికట్ట-రామేశ్వరం రహదారి
- పదేళ్లుగా మరమ్మతులకు నోచని మట్టిరోడ్డు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు.. వాహనదారుల ఇబ్బందులు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట నుంచి కిషన్‌నగర్ మీదుగా రామేశ్వరం దేవాలయానికి వెళ్లే లింక్ రోడ్డు పాడైపోయి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర పూర్తిగా తేలిపోవడమే కాకుండా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దాంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎలికట్ట పరిగి రోడ్డు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుకు గత పదేళ్లలో కనీసం మట్టితో కూడా మరమ్మతులు చేయలేదు. తద్వారా రోడ్డు గుంతలమయంగా మారింది. రామేశ్వరం ఆలయానికి ప్రతీ పున్నమికి రాత్రిపూట నిద్ర చేయడానికి ప్రజలు, భక్తులు వెళ్తుంటారు. మొగిలిగిద్దతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రామేశ్వరం దేవాలయానికి వెళ్లాలంటే లింక్ రోడ్డు బాగాలేకపోవడంతో షాద్‌నగర్‌కు వచ్చి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఈక్రమంలో వాహనదారులు, ప్రయాణికులు షాద్‌నగర్ వచ్చి జాతీయ రహదారి మీదుగా వెళ్లి రాయికల్ ద్వారా ఆలయానికి వెళ్తున్నారు. రెండు కిలోమీటర్ల రూరం ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేస్తే పది కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కనీసం మట్టితోనైనా మరమ్మతులు చేయాలని వాహనదారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలిన రామేశ్వరం లింక్‌రోడ్డు

మరమ్మతులు చేపట్టాలి



ఎలికట్ట నుంచి కిషన్‌నగర్ వరకు లింక్ రోడ్డును బాగు చేస్తే రామేశ్వరం ఆలయానికి వెళ్లేందుకు దూరభారం తగ్గుతుంది. కార్లలో వెళ్లాలంటే గుంతలు ఉండటం వల్ల వీలు కావడం లేదు. కనీసం మరమ్మతులైనా చేయాలి.

- రాము, మొగిలిగిద్ద, ఫరూఖ్‌నగర్ మండలం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా



ఎలికట్ట నుంచి రామేశ్వరం వెళ్లే లింక్ రోడ్డు నిజంగానే పాడైపోయింది. గుంతలు పడి, కంకర తేలిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మత్తులు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృస్టికి తీసుకెళ్తాం.

- కావలి శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ, ఎలికట్ట

వెసెక్టమికి వెనకడుగు!

(5వ పేజీ తరువాయి)

ఆపరేషన్ల లెక్కలను పరిశీలిస్తే.. 2022-23 సంవత్సరంలో డీపీఎల్ క్యాంపు ద్వారా 1,933 మంది మహిళలు ఆపరేషన్లు చేసుకున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో కు.ని చేసుకున్న మహిళల్లో నలుగురు మరణించడంతో ఈ ఆపరేషన్లు నిలిపివేశారు. రెండేళ్ల నుంచి కు.ని. క్యాంపులు నిర్వహించడం లేదు.. మూడేళ్లలో కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మొత్తం 16,870 ట్యుబెక్టమి ఆపరేషన్లు జరిగాయి. అందులో ప్రభుత్వ ఆసుపత్రిలో 1,663, ప్రైవేట్‌లో 15,207 జరిగాయి. అత్యధికంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే ట్యుబెక్టమీ ఆపరేషన్లు జరిగినట్లు అధికారికంగా లెక్కల ప్రకారం తెలుస్తుంది. మూడేళ్లలో 16826 మంది మహిళలు ట్యుబెక్టమి ఆపరేషన్లు చేయించుకుంటే, 44 మంది పురుషులు మాత్రమే వెసక్టమి ఆపరేషన్లు చేయించుకున్నారు.

పురుషులకే సులువు

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ మహిళల కంటే పురుషులకే సులువని వైద్యులు చెబుతున్నారు. మగవాళ్లకు ఎలాంటి కడుపు కోత లేకుండా 5 నుంచి 10 నిమిషాల్లో ఆపరేషన్ అయిపోతుంది. వాళ్లు వెంటనే ఇంటికి, పనులకు వెళ్లొచ్చని అంటున్నారు. వీర్యం ప్రయాణించే చిన్న వాహికకు గాటు పెట్టి.. అక్కడే మూసివేస్తారు. ఒకసారి ఈ ఆపరేషన్ పూర్తయ్యాక మళ్లీ కావాలనుకుంటే దీన్ని తెరిచే అవకాశాలు కూడా ఉంటాయి. అదే మహిళలకు ఆపరేషన్ పూర్తయ్యాక నెల రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలి. కొన్ని నెలలపాటు బరువులు ఎత్తకూడదు. ఆపరేషన్ జరిగిన పొట్ట భాగంలో ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదమూ ఉంది.

ప్రోత్సాహకం రూ.1,100

వెసక్టమి ఆపరేషన్ చేయించుకున్న వారికి ప్రభుత్వం రూ.1,100 ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఆపరేషన్ చేయించుకోవాలని ప్రోత్సహించి ఆసుపత్రికి తీసుకొచ్చిన వారికి కూడా రూ.250 చెల్లిస్తారు. వెసక్టమి చేసిన వైద్యుడికి రూ.150 ఇస్తారు. అదే ట్యుబెక్టమి చేయించుకునే మహిళలకు రూ.850, ప్రోత్సహించి తీసుకొచ్చిన వారికి రూ.150 చెల్లిస్తారు.

కొరవడిన అవగాహన

వెసక్టమిపై పురుషులకు అవగాహన లేకే ముందుకు రావడం లేదు. ఈ ఆపరేషన్ చేయించుకుంటే శారీరకంగా బలహీనమవుతామనే అపోహ కూడా ఉంది. దీన్ని అధిగమించేందుకు వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండే ఆశ, ఏఎన్ఎమ్‌లు, అంగన్‌వాడీలు విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. అలాంటి కార్యక్రమాలు ఏవీ జరగడం లేవు. ప్రసవ సమయంలోనే చాలా మంది మహిళలు ట్యూబెక్టమి చేయించుకుంటున్నారు.

పక్షోత్సవాలపై ప్రచారం కరువు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు వెసక్టమి శస్త్ర చికిత్స పక్షోత్సవాలు నిర్వహిస్తుంది. ఇవి జరుగుతాయనే విషయం కూడా ఎవరికీ తెలియదు. "కుటుంబ నియంత్రణలో పురుషుల భాగస్వామ్యం.. తల్లీబిడ్డల ఆరోగ్యం సురక్షితం" అంటూ ఆసుపత్రుల ఎదుట బ్యానర్ కట్టి వదిలేశారు. పురుషులకు వెసక్టమి ఆపరేషన్లపై అవగాహన కల్పించాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ ఆపరేషన్లపై గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ అది ఎక్కడ జరగడం లేదు. గత నెల 28న చేవెళ్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, 29న షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వెసక్టమి ఆపరేషన్లు చేయాల్సి ఉంది. కానీ.. ఆపరేషన్ చేయించుకోవడానికి ఒక్కరు కూడా రాలేదు.

అపోహలు తొలగించడానికి కృషి



వెసెక్టమి ఆపరేషన్‌పై ఉన్న అపోహలను తొలగించడానికి కృషి చేస్తున్నాం. ప్రధానంగా వైవాహిక జీవితంలో ఇబ్బందులు వస్తాయని పురుషుల్లో బలంగా నాటుకుపోయింది. ఇది నిజం కాదు. దీనిపై గ్రామాల్లో, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తున్నాం.

- వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి

రోడ్డు విస్తరణ చేపట్టాల్సిందే

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి

సైతం ప్రభుత్వం వైద్యం అందించి పరిహారం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం రోడ్డు విస్తరణ కోసం భూ సేకరణ చేసి రైతులకు పరిహారం అందించినా నేటికీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాకపోడం బాధాకరమన్నారు. కోర్టు కేసుల పేరుతో రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగకపోవడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, ధర్నాను విరమించాలని పోలీసులు విజ్ఞప్తి చేసినా ఆందోళనకారులు పట్టించుకోలేదు. చివరకు చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అక్కడకు వచ్చి రోడ్డు విస్తరణ పనులపై కోర్టులో కేసు ఉండడంతో ఆలస్యం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసి బాధిత రైతులకు పరిహారం రూ. 135 కోట్లు చెల్లించిందన్నారు. ఇంకా కొంతమంది రైతులు పరిహారం తీసుకోకపోవడంతో కోర్టులో డిపాజిట్ చేస్తామన్నారు. ఈ నెల 16న చెన్నయ్ కోర్టులో గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు తీర్పు ఉందన్నారు. రోడ్డు విస్తరణ పనులు సైతం తొందరగా కొనసాగేలా చూస్తామని తెలిపారు. దీంతో ఆందోళనకారులు ధర్నాను విరమించారు. అదేవిధంగా ఈ రోడ్డు విస్తరణ చేయకుండా గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసిన చెన్నైకి చెందిన తేజపై చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్, శర్వలింగం చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రమాదంలో మరణించిన ఆలూర్ గ్రామానికి చెందిన నక్కలపల్లి రాములు, కృష్ణతోపాటు నాన్‌చెరువు గ్రామానికి చెందిన సుజాత కుటుంబ సభ్యులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదేశాల మేరకు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ ఒక్కో కుటుంబానికి రూ. 20 వేల చొప్పున అంత్యక్రియల నిమిత్తం వారికి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఏడాదిలోగా పనులు పూర్తి చేయిస్తాం : ఎమ్మెల్యేలు

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు గత నెల 28వ తేదీనే ప్రారంభం అయ్యాయని చేవెళ్ల, పరిగి ఎమ్మెల్యే యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వలనే రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగలేదని ఆరోపించారు. ఈ రోడ్డు విస్తరణపై గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు ఉందని, దానిపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారని చెప్పారు. ప్రభుత్వం రోడ్డు భూసేకరణ కోసం రూ. 135 కోట్లు పరిహారం అందించిందన్నారు. రోడ్డు పనులపై రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మృతులకు కుటుంబాలకు భారీగా పరిహారం అందించేలా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతామని, అదేవిధంగా నేషనల్ హైవే నుంచి రూ. రెండు లక్షలు, రైతుబీమా కింద 5 లక్షల చొప్పున పరిహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శుభప్రద్‌పటేల్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, సీపీఐ, సీపీఎం నాయకులు రామస్వామి, ప్రభులింగం, దేవేందర్, టీపీసీసీ సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మంచాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగంపల్లి గేటు వద్ద మంగళవారం సాయంత్రం కోళ్లదాణా ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం కడీలబాయి తండాకు చెందిన కరంటోత్ మహేష్(21) పల్సర్‌బైక్‌పై ఇబ్రహీంపట్నం నుంచి స్వగ్రామానికి వెళుతుండగా లింగంపల్లి గేటు సమీపంలో వెనకాల నుంచి వేగంగా వస్తున్న కోళ్లదాణా ట్యాంకర్ ఢీకొట్టింది. దాంతో మహేష్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధు తెలిపారు.

గొర్రెల అపహరణ కేసులో నిందితుల రిమాండ్

మాడ్గుల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గొర్రెలు అపహరించుకుపోయిన నిందితులను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని అప్పారెడ్డిపల్లి శివారులో మాడ్గుల గ్రామానికి చెందిన మంచన కరుణాకర్ గొర్రెల షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. నవంబరులో 28 గొర్రెలను దొంగలు అపహరించుకెళ్లార. ఈమేరకు కరుణాకర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం మంగళవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ జగదీష్ తెలిపారు. నిందితులు రాజమండ్రికి చెందిన బడుగు రాజేంద్ర అలియాస్ రాజేష్, షేక్‌వలిలు సైదబాద్‌కు చెందిన యంజాల సాయికుమార్‌ను రిమాండ్‌కు పంపారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కేశంపేట/ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేశంపేట మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య ఆవరణలో మంగళవారం దివ్యాంగులకు మంజూరైన 5 బ్యాటరీ ట్రైసైకిళ్లు, 4 వీల్‌చైర్లు, 9 యంఆర్ కిట్లు, ఒక ఎలక్ట్రిక్ బ్లైండ్ స్టిక్ పంపిణీ చేసే కార్యక్రమనికి హాజరై వారికి అందించారు. కేశంపేటలో దివ్యాంగుల పునరావాస కేంద్రం నిర్మాణానికి నూతనంగా భవనం మంజూరు చేస్తామన్నారు. డీఆర్‌డీఏ డీపీఎం నర్సింలు, మండల ప్రత్యేకాధికారి రాజారత్నం, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి సకలాంగులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని ఆమనగల్లు ఎంఈవో పాండు అన్నారు. ఆమనగల్లు భవిత దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు క్యారం, క్రికెట్, పరుగు పందెం, మ్యూజికల్ చైర్, చెంచా గోళి తదితర క్రీడలను నిర్వహించారు. ఎంఈవో పాండు బహుమతులు అందజేశారు. టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తిచేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్ కోరారు. అప్పా జంక్షన్ నుంచి మన్నె గూడ వరకు విస్తరించ తలపెట్టిన రోడ్డు పనులు మంగళవారం కొన్ని ప్రమాదకర మూలమలుపుల వద్ద ప్రారంభమయ్యాయి. అజీజ్‌నగర్ చౌరస్తా సమీపంలోని మూలమలుపు వద్ద జరుగుతున్న పనులను నాయకులతో కలిసి పరిశీలించారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి



ఆమనగల్లు : నివాళులర్పిస్తున్న దశరథ్ నాయక్, రామకృష్ణ, ఆనంద్

యాచారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా వదలుకున్న శ్రీకాంతాచారి ఆశయ సాధనకు యువత కృషి చేయాలని మండల విశ్వబ్రహ్మణ సంఘ నాయకులు మారోజు శ్రీనివాస్‌చారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో శ్రీకాంత్‌చారి వర్ధంతి సందర్భంగా విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

కడ్తాల్ : శ్రీకాంతాచారి ప్రాణత్యాగం మరువలేనిదని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎగ్రోళ్ల రాఘవేందర్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లు అన్నారు. మండల కేంద్రంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, ఏఎంసీ డైరెక్టర్ నరేశ్‌నాయక్, నాయకులు తదితరులున్నారు. అలాగే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని జరుపుకున్నారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు నివాళులర్పించారు.

తలకొండపల్లి : తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శ్రీకాంతాచారి వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను నాయకులు కొనియాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై అమరవీరుల స్థూపంవద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాంతాచారి ఆత్మబలిదానంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోశాడని, ఆయన్ను ప్రజలు మరువరని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు మడుపు వేణుగోపాల్‌రావు, జెర్కోని రాజు, కర్నె అరవింద్ తదితరులున్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

తలకొండపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య తెలిపారు. లెప్రసి, పల్స్‌పోలియో పెండింగ్ డబ్బులను వెంటనే చెల్లించాలని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఐటీయు నాయకుడు పెంటయ్య స్థానిక వైద్యురాలుకు అందజేశారు. ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి శిరీష, నిర్మల, కోమటి, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్, ఆశాలు

కందుకూరు : ఆశావర్కర్ల సమస్యలను వెంటనే గుర్తించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఆశావర్కర్లతో కలిసి మండల వైద్యాధికారికి వినతిపత్రం ఇచ్చారు. కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు ప్రతీఒక్కరు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఆశావర్కర్ల సంఘం మండలాధ్యక్షురాలు సరస్వతి, నాయకురాల్లు సుశీల, సంధ్య, తదితరులున్నారు.

యాచారం : ఆశావర్కర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయా జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందూనాయక్‌లు డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని మండల వైద్యాధికారి శివకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశాలు ముక్తాబాయి, జంగమ్మ, లలిత, గోవిందమ్మ, యాదమ్మ, సైదమ్మ తదితరులున్నారు.

షాబాద్ : ఆశా కార్యకర్తల సమస్యలపై నేడు కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదయం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు చందన్‌వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌కు ఆశా సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు.

ప్రొటోకాల్‌పై ప్రశ్నించిన కౌన్సిలర్లు

- చైర్మన్‌ను అవమానపర్చారని ఆవేదన

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకం శంకుస్థాపన పనుల్లో ప్రొటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో 27.5 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన అమృత్ 2.0 పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేరు తర్వాత పెట్టాల్సిన మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పేరును విశిష్ట అతిథుల తరువాత ఎందుకు పెట్టాలరని కౌన్సిలర్ బచ్చల నర్సింహా ప్రశ్నించారు. అక్కడే ఉన్న కమిషనర్ వెంకన్న, డీఈ షేక్ సాజిద్‌లను నిలదీశారు. చైర్మన్‌ను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదని వాదించారు. తమకు డీఆర్వో ఇచ్చిన ప్రొటోకాల్ ప్రకారం చైర్మన్ పేరును వేయించాం.. సొంత నిర్ణయం కాదని, డీఆర్వోకు చెప్పి, మార్పులు చేయించుకోవాలని వివరణ ఇచ్చారు.

సంక్షిప్తంగా..

శంకర్‌పల్లి : మేకలు, గొర్రెలకు పారుడు రోగం టీకాలు వేయించాలని శంకర్‌పల్లి పశువైద్యురాలు శ్రావణిగౌడ్ తెలిపారు. టంగటూరులో మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ మున్సిపాలిటీలో అమృత్ 2.0 పథకంతో ఇంటింటికి తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని అయ్యప్పకాలనీలో అమృత్ 2.0 పథకంలో నిర్మించతలపెట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ. 27.5 లక్షల వ్యయంతో అయ్యప్పకాలనీతో పాటు సీఎస్‌కేలో రెండు వాటర్ ట్యాంకులను, 50 కిలో మీటర్ల పైపులైన్లను నిర్మిస్తామని తెలిపారు. చైర్మన్ నరేందర్, అమృత్ 2.0 పథకం ఈఈ ప్రభాకర్‌రెడ్డి, డిఈ షేక్ సాజిద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ విశ్వం, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్ : వసతి గృహాల్లో సౌకర్యాలు, భోజనాలను పరిశీలించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాల సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను అనుమతి లేదంటూ సిబ్బంది అడ్డుకున్నారు. ఉస్మానియా యూనివర్శిటీ బీఆర్ఎస్వీ నాయకులు దశరథ్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ఎస్వీ నాయకులు పాఠశాలకు వెళ్లి పరిశీలిస్తుండగా లోపలికి వెళ్లేందుకు అనుమతి లేదంటూ సిబ్బంది అడ్డుకున్నారు. దాంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సుశీల సిబ్బందితో వెళ్లి బీఆర్ఎస్వీ నాయకులను అదుపులోకి స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచి పెట్టారు.

తలకొండపల్లి : మండల కేంద్రం ఏర్పాటుకు గట్టిప్పలపల్లి గ్రామ జేఏసీ నాయకులు పోరాటం ఉధృతం చేశారు. ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 33వ రోజుకు చేరాయి. దీక్షలో స్థానిక నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు పాల్గొన్నారు.

కడ్తాల్ : రైతుల శ్రేయస్సు, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బీచ్యనాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు ఆనందంగా ఉంటే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విషప్రచారాలకు తెరలేపారని అన్నారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు భూస్థాపితం తప్పదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రజా రంజక పాలన చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు అసత్యం ప్రచారాలు సాగిస్తున్నారని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో విలేకరుల సమావేశంలో సత్యం మాట్లాడుతూ ఏడాది కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అద్భుత విజయాలు సాధించిందన్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోకపోతే తగిన గుణపాఠం తప్పదన్నారు.

మహేశ్వరం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్న బియ్యంతో అన్నం పెడుతున్నామన్న కాంగ్రెస్ మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయిందని బీఆర్ఎస్ మండల నాయకులు రాయప్ప, పోతుల నర్సింగ్ పటేల్ అన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే ఆదేశానుసారం అమీర్‌పేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకోగా దొడ్డు బియ్యంతో అన్నం వండుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం పెట్టేవరకు బీఆర్ఎస్ విద్యార్థుల తరఫున పోరాడుతూనే ఉంటుందని వారు తెలిపారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



షాద్‌నగర్ : 2కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

షాద్‌నగర్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఏడాది ప్రజాపాలన విజయోత్సవాలను చూసి భూమి దద్దరిల్లిందని.. ఆకాశం పులకరిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణ ప్రధాన కూడలి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించిన 2కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ పదేళ్లలో జరగని అభివృద్ధిని ఒక్క ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చూపించిందన్నారు. అనంతరం కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో అమృత్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ఫరూఖ్‌నగర్ మండలం వీర్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే సొంత డబ్బును వేతనంగా అందజేశారు. ఏడాది నుంచి ఎలాంటి వేతనాలు అందకపోవడంతో ఆయనకు రూ.30వేలు అందజేశారు. అలాగే ప్రత్యేక తెలంగాణ పోరులో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి అమరవీరుడని ఎమ్మెల్యే శంకర్ కొనియాడారు. కార్యక్రమాల్లో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, నాయకులు కష్టారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, విశ్వం, చెన్నయ్య, బాలరాజుగౌడ్ తదితరులున్నారు.

ఆమనగల్లు : ఉత్తమ పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కార్యాలయంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అర్బన్‌డే సందర్భంగా ఉత్తమ పారిశుధ్య సిబ్బందిని చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంతలు సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 8 మహిళా సంఘాలకు మంజూరైన రూ.కోటి చెక్కును అందజేశారు. కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : ప్రజా సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి 2కే రన్‌ను ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఉపవైద్యాధికారి నాగేందర్ బాబు, వైద్యాధికారి రేవతి, మున్సిపల్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం : పారిశుధ్యం పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి అన్నారు. అర్బన్‌డే కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు పారిశుధ్య కార్మికులచే అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈశా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సిబ్బందికి పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. కమిషనర్ రవీందర్‌సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బర్ల మంగ తదితరులున్నారు. అలాగే ప్రజా అవసరాలను గుర్తించి రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగిన కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతుందని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్ రెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు నుంచి మంగల్‌పల్లి వరకు పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్మికులకు పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : కిట్లు పంపిణీ చేస్తున్న నిరంజన్‌రెడ్డి

కొత్తూర్ : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్ యాదవ్, కమిషనర్ బాలాజీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం ముందు కమిషనర్ బాలాజీ ప్రజాప్రతినిధులు, ప్రజల చేత విజయోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య కార్మికులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, భోజన వసతి కల్పించారు. వైస్‌చైర్మన్ రవీందర్, కాంగ్రెస్ మున్సిపాలిటీ, మండల శాఖల అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, నాయకులు జగన్, సత్తయ్య, వీర్లగూడెం మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీని స్వచ్ఛ, సంపూర్ణ పారిశుధ్య మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలంత సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. పోలీసు స్టేషన్, చేపల మార్కెట్, కూరగాయల మార్కెట్ కూడళ్లలో కార్మికులతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ముగ్గులు వేశారు.